**ప్రపంచంలోనే మొదటిసారిగా ఇక్రిశాట్ "రాపిడ్ రాగి పద్ధతి" ఆవిష్కరణతో వేగవంతమైన మరియు చౌకైన రాగి ప్రజననం.**

**జూన్ 19, 2025**

అంతర్జాతీయ శుష్కపంటల పరిశోధనా సంస్థ (ఇక్రిశాట్) రాగి పంట పై పనిచేసే శాస్త్రవేత్తల కోసం వేగవంతమైన ప్రజనన పద్ధతి "రాపిడ్ రాగి" ని ప్రవేశపెట్టింది.

వినూత్నమైన ఈ పద్ధతి వలన పంట వ్యవధిని గణనీయంగా తగ్గించవచ్చు. తద్వారా నూతన వంగడాలను త్వరితగతిన తయారు చేయవచ్చు.

సంప్రదాయ పద్ధతి లో ఒక సంవత్సరములో ఒకటి లేదా రెండు పంటల ను పూర్తి చేయవచ్చు. అయితే నూతనంగా ఆవిష్కరించిన "రాపిడ్ రాగి" పద్ధతిలో 4 - 5 పంటలను పరిశోధనశాలలో పూర్తి చేయవచ్చు. ఈ పద్ధతి రాగి ప్రజననంలో విప్లవాత్మకమైన మార్పులకు నాంది పలుకుతుంది, మరీ ముఖ్యంగా

రాగినే ఆహారంగా తీసుకునే ఆసియా, ఆఫ్రికా దేశాలలో బడికి వెళ్లే పిల్లల పోషణకు మరియు పౌష్టికాహార సంబంధ కార్యక్రమాల్లో భాగా వినియోగించబడుతుంది. ప్రపంచవ్యాప్తంగా శాస్త్ర వేత్తలకు అందరికీ అందుబాటులో ఉండేవిధంగా ఇక్రిశాట్ అభివృద్ధి చేసిన వేగవంతమైన ప్రజనన పద్ధతులలో శనగ, కంది తర్వాత రాగి మూడవది. దీని ద్వారా సమయాన్ని మరియు వనరులను ఆదా చేయవచ్చు. తద్వారా అధిక పోషక విలువలు కలిగిన అధిక దిగుబడినిచ్చే మరియు వాతావరణ మార్పులను తట్టుకునే నూతన వంగడాల అభివృద్ధిలో రాగిపై పరిశోధించే శాస్త్ర వేత్తలకు ఇది ఉపయోగపడుతుందని ఇక్రిశాట్ డైరెక్టర్ జనరల్ డా|| హిమాన్షు పాథక్ తెలిపారు.

జొన్న, సజ్జ పంటల తరువాత రాగి మూడవ ప్రధానమైన చిరు ధాన్యపు పంట. 2018ని 'జాతీయ చిరు ధాన్యాల సంవత్సరం'గా భారతదేశం మరియు 2023 ని ఐక్యరాజ్య సమితి "అంతర్జాతీయ చిరు ధాన్యాల" సంవత్సరంగా ప్రకటించిన తరువాత రాగి సాగుపై ఆసక్తి తిరిగి ఊపందుకుంది.

చిరుధాన్యాల ప్రజననం అధిక ఖర్చు మరియు సమయంతో కూడుకున్నది. వరి, గోధుమ, మరియు మొక్కజొన్న పంటలకు ఇచ్చే అధిక ప్రాముఖ్యత వలన చిరుధాన్యాలపై పరిశోధన మరుగున పడిపోయింది. అయితే ఈ వేగవంతమైన రాగి ప్రజనన పద్ధతి వలన చిరు ధాన్యాల పంటల అభివృద్ధికి

మేలు కలుగుతుందని ఇక్రిశాట్ డిప్యూటి డైరెక్టర్ జనరల్ -(పరిశోధన మరియు ఆవిష్కరణ) డా॥ స్టాన్ ఫోర్డ్ బ్లేడ్ అన్నారు .

రాగి పంట కాలాన్ని 100 - 135 రోజుల నుండి 68 - 85 రోజులకు తగ్గించడంలో నూతనంగా ఆవిష్కరించబడిన" రాపిడ్ రాగి' పద్ధతి ఉపయోగపడుతుంది. మొక్క సొంతం ఎండే వరుకు వేచి చూడకుండా కంకులు తయారైన వెంటనే కోసి వేస్తే 61 - 78 రోజుల్లోనే పంటను పూర్తి చేయవచ్చు. పరిశోధనశాలలో పంటపై పడే కాంతిని, ఉష్ణోగ్రత, ఆర్ద్రత, మరియ మొక్కల సాంద్రత, నీరు మరియు ఎరువులను నిర్ధారిత మోతాదు మరియు సమయాలలో అందించడం ద్వారా ఈ తగ్గుదలను సాధిస్తారు.

ఇక్రిశాట్ 4 సంవత్సరాల పరిశోధన ఫలితమే ఈ రాపిడ్ రాగి. కేవలం పంట వ్యవధిని తగ్గించడంపైనే కాక వ్యయాలను తగ్గించడంపై కూడా దృష్టి పెట్టి దీనిని ప్రపంచవ్యాప్తంగా వివిధ పర్యావరణాలలో పనిచేసే రాగి శాస్త్రవేత్తలకు ఉపయోగపడేవిధంగా తయారు చేయడం జరిగిందని ఇక్రిశాట్ గ్లోబల్ రీసెర్చ్ ప్రోగ్రామ్ డైరెక్టర్ డా|| షాన్ మేస్ తెలిపారు.

శనగ మరియు కంది పంటల కొరకు అభివృద్ధి చేసిన ఈ రకమైన పద్ధతులలో కృత్రిమ కాంతిని వివిధ దశలలో ఉపయోగిస్తారు. అయితే రాగి పంటకు కృత్రిమ కాంతి అవసరం లేదు. అందువలన రాపిడ్ రాగి పద్ధతి సులువైన మరియు చౌకైన పద్ధతి. మబ్బులు కమ్మిన రోజులలో తప్ప మిగతా సమయాలలో సహజ కాంతిని  వాడవచ్చు.

చిరుధాన్యాల కొరకు అభివృద్ధి పరచబడిన మొట్టమొదటి వేగ వంతమైన ప్రజనన పద్ధతి  రాపిడ్ రాగి అని ఈ పరిశోధనకు నాయకత్వం వహించిన ఇక్రిశాట్ సీనియర్ శాస్త్రవేత్త డా|| శోభన్ సజ్జా తెలిపారు. దీనిని ఆధారంగా చేసుకుని కొర్ర, వరిగ, ఊద, సామ, మరియు అరికెలలో కూడా వేగవంతమైన ప్రజనన పద్ధతిని కనిపెట్టే దిశలో పరిశోధనలు జరుగుతున్నాయని, మొదటి దశ ప్రయోగాలు ఆశాజనకమైన ఫలితాలనిచ్చాయని ఆయన తెలిపారు.

ఇక్రిశాట్ సంప్రదాయాన్ని అనుసరించి ఈ రాపిడ్ రాగి పద్ధతి ప్రపంచవ్యాప్తంగా పరిశోధనలు సాగించే రాగి ప్రజనన కారులకు మరియు శాస్త్రవేత్తలకు అందుబాటులో అంతర్జాలంలొ ఉంచడం జరిగింది.